క్లుప్తంగా

సరదాగా.. కాసేపు



దుకాణం వద్ద టీ తాగుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. పోలింగ్ శాతం బాగా నమోదు కావడంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి నాయకులు, కార్యకర్తలతో సరదాగా గడిపారు. ఒక టీ దుకాణం వద్ద కూర్చుని టీ తాగారు.

ఆశీర్వదించిన ప్రజలకు పాదాభివందనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగిన పోలింగ్‌లో తమను ఆదరించినందుకు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి పాదాభివందనాలు తెలిపారు. వారు మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాల వల్ల లబ్ధిపొందిన ప్రజలు మరోసారి జగనన్నను నమ్మారని పేర్కొన్నారు. ఎండను సైతం లెక్క చేయకుండా ఆశీర్వదించడానికి వచ్చారన్నారు. తమను గెలిపించబోతున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు అంజూరు తారక శ్రీనివాసులు, లోకేష్‌యాదవ్, సురేష్, కంఠా ఉదయ్, శరవణకుమార్, చంద్ర, సురేష్, అరవింద్‌రెడ్డి, లక్కమనేని కృష్ణ, మునిరెడ్డి, సునీతాసింగ్, హిమబిందు, సుందరేష్ పాల్గొన్నారు.

సత్యవేడులో 82.94 శాతం



కన్నావరంలో బారులు తీరిన ఓటర్లు

సత్యవేడు: సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాత్రి 10 గంటలకు 81.39 శాతం పోలింగ్ అయినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. సత్యవేడు నియోజకవర్గ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సత్యవేడు పరిధిలో కన్నవరంలో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా జరిగింది. 6 గంటల సమయానికి క్యూలో 150 మంది పైగా ఓటర్లు ఉండడంతో వారందరికి స్లిప్స్ అందజేశారు. 9 గంటలకు కూడా క్యూలో ఓటర్లు నిలుచొనిఉన్నారు. నియోజకవర్గ పరిధిలో 279 పోలింగ్ బూత్‌లలో పోలింగ్ జరిగింది.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు



నాగలాపురం: ఓటు వేయడానికి వచ్చిన దివ్యాంగురాలు

నాగలాపురం: మండలంలో సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ బూతుల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటలవరకు పోలింగ్ కొనసాగింది. అదేవిదంగా గడువు సమయానికి క్యూలైన్లో ఉన్నవారందరికి అధికారులు ఓటింగ్ అవకాశం కల్పించారు. 33 పోలింగ్‌స్టేషన్లో పోలింగ్ సమయం ముగిసే సరికి 80 శాతం పోలింగ్ నమోదుఐనట్లు తహసీల్దార్ నరసింహులు తెలిపారు. దివ్యాంగులు నడవలేని పరిస్థితిలో ఉన్న వృద్ధులు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలుచోట్ల ఓటు ప్రారంభంలో ఈవీఎంలు మొరాయించినా అధికారులు వెంటనే స్పందించి సరిచేశారు. సీఐ దివాకర్‌రెడ్డి పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించినట్లు తెలిపారు.



నాగలాపురం: క్యూలో ఓటర్లు

కండలేరులో 6.842 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 6.842 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 220 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 70 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పాతవీరాపురంలో అల్పాహారం తీసుకుంటున్న ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఏర్పేడు పోలింగ్ స్టేషన్‌లో ఓటర్లకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆమందూరు పోలింగ్ స్టేషన్‌లో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి







ఓటెత్తిన చైతన్యం



రేణిగుంట బాలికోన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో క్యూలో నిల్చున్న ఓటర్లు

- ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద కిక్కిరిసిన ఓటర్లు
- రేణిగుంటలో ప్రశాంతంగా జరిగిన పోలింగ్ ప్రక్రియ
- శ్రీకాళహస్తి నియోజకవర్గ పోలింగ్ శాతం 79.03

రేణిగుంట: సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరారు. గంటల తరబడి క్యూలైన్లలో నిల్చుని ఓటేశారు. అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేయడంతో ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగలేదు. రేణిగుంట మండలంలోని 66 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఆ సమయానికే ఓటర్లు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. మండలంలోని తారకరామానగర్‌లో ప్రత్యేకంగా మహిళలకు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వృద్ధులు, వికలాంగులను నేరుగా వాహనాల్లో పోలింగ్ కేంద్రాల ప్రాంగణంలోకి తీసుకొచ్చి వీల్ చైర్లలో లోపలికి తీసుకెళ్లి ఓటు వేయించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లతో ఆరోగ్య సిబ్బంది సేవలందించారు. ఓటర్లకు ఎండ తగలకుండా చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 గంటల వరకు క్యూలైన్లలో వేచి ఉన్న వారందరికీ పోలింగ్ సిబ్బంది స్లిప్పులు ఇచ్చి ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు.

ఓటు వేసిన సినీ దర్శకుడు మేర్లపాక గాంధీ

తెలుగు సినీ దర్శకుడు మేర్లపాక గాంధీ రేణిగుంట పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముఖ్యంగా యువత అధిక సంఖ్యలో ఉత్సాహంగా ఓట్లు వేశారు. మండలంలోని 66



దుర్గివేరిలో బారులుతీరిన ఓటర్లు

పోలింగ్ కేంద్రాల్లో 61,497 మంది ఓటర్లకుగాను మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. శాతం ఓటింగ్ నమోదైంది.

ఏర్పేడులో 70 శాతం పోలింగ్

ఏర్పేడు : మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. 70 శాతం పోలింగ్ జరిగినట్లు తహసీల్దారు ఉదయ్‌భాస్కర్ రాజు తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం 52 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ జరిగింది. మర్రిమంద, చిందేపల్లి, చెల్లూరు, గుండ్లకండ్రిగ, రావిళ్లవారికండ్రిగ, అంజిమేడు తదితర పోలింగ్ స్టేషన్‌ల్లో ఈవీఎంలు మొరాయించడంతో సుమారు 30 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. మేర్లపాక, ఏర్పేడు, అంజిమేడు తదితర 21 పోలింగ్ స్టేషన్‌లలో సాయంత్రం 6 గంటలకు పైగా పోలింగ్ జరిగింది. ఎండ తీవ్రతను సైతం లెక్క చేయకుండా ఓటర్లు క్యూలైన్లలో బారులుతీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి





ఓటువేసి చిరునవ్వులు చిందిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి, బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఏర్పేడు పోలింగ్ స్టేషన్, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆమందూరు పోలింగ్ స్టేషన్‌లో పోలింగ్ సరళిని పరిశీలించారు.

ఎన్నికలు ప్రశాంతం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో సోమవారం ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ జరిగింది. 6 గంటలకు క్యూలో ఉన్నవారికి టోకెన్లు ఇచ్చి ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. పట్టణంలో 57, 58, వీఎంపల్లెలో 1బూత్, ఎస్టీఆర్‌కాలనీ, 28వ వార్డుల్లో ఈవీఎంలు మొరాయించాయి. పెద్ద ఎత్తున మహిళలు, వృద్ధులు ఉదయమే బారులు తీరారు. ఎన్నడూ లేవిధంగా 70 నుంచి 90 శాతం ఓట్లు పోలయ్యాయి. పట్టణంలోని వెలంపాళెం, జెడ్పీ బాలికల పాఠశాల, బహదూరుపేట పాఠశాల వద్ద చెదురుమదురు ఘటనలు జరిగాయి. వెలంపాళెంలో టీడీపీ నాయకుడు లక్కమనేని మధు ముస్లిం మహిళలను గేలిచేస్తూ మాట్లాడటంతో పోలీసులు అడ్డుకుని అతనిని దూరంగా పంపించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద టీడీపీకి చెందిన కొందరు ప్రచారం చేస్తుండగా వైఎస్సార్ సీపీ నాయకులు అడ్డుకున్నారు. మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరాజ్ బాషా అక్కడికి చేరుకుని వారించే ప్రయత్నం చేయగా టీడీపీ నాయకులు తిరగబడటంతో వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు వారిని చెదరగొట్టారు. సుధీర్ రెడ్డి అక్కడికి చేరుకుని మళ్లీ రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారు. పోలీసులను మీ అంతు చూస్తానని, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించాడు. ఆయన అండతో టీడీపీ శ్రేణులు పోలీసులపై దూసుకెళ్లారు. బహదూరుపేల పురపాలక పాఠశాల సమీపంలో బృందమ్మ కారును తీసుకెళ్లి బూత్ ముందు పెట్టి బూత్‌లో 15 నిమిషాలు ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. అక్కడ టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ వారిని పదేపదే కవ్వించి గొడవకు దిగాలని ప్రయత్నించారు. అంజూరు తారకశ్రీనివాసులు, మిద్దెల హరి, ఉన్నం వాసు నాయుడు, వయ్యాల కృష్ణారెడ్డి తదితరులు ఆయా బూత్‌ల వద్ద ఓటింగ్ సరళిని పరిశీలించారు.



రేణిగుంట: తూకివాకంలో ఓటరుకు సిరా చుక్క రాస్తున్న పోలింగ్ సిబ్బంది



రేణిగుంట మండలం కొత్తపాళెంలో ఓటు వేసేందుకు సహాయకులతో వచ్చిన ఓ వృద్ధురాలు



అంజిమేడులో బారులు తీరిన ఓటర్లు



ఏర్పేడులో ఓటర్లు



గుండ్లకండ్రిగలో బారులు తీరిన ఓటర్లు.



రేణిగుంటలో ఓటు వేస్తున్న సినీ దర్శకుడు మేర్లపాక గాంధీ

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- మొరాయించిన ఈవీఎంలు
- పలుచోట్ల ఆలస్యంగా పోలింగ్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని 35 పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండి ఓటర్లు బారులు తీరారు. వేణుగోపాలపురం, కల్లివెటు, నెలవల్లి, పార్లపల్లి, తలారివెట్టు, కనమనంబేడు, పార్లపల్లి, గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. మరి కొన్నిచోట్ల ఈవీఎంలు కొంతసేపు ఇబ్బంది పెట్టాయి. దీంతో ఓటర్లు బారులు తీరారు. మండల ఎన్నికల అదనపు అధికారి పటాన్ అహ్మద్ ఆలీఖాన్ పోలింగ్ కేంద్రాలను పోలింగ్ బూత్‌ల పర్యవేక్షించి, ఈవీఎంలను ఎప్పటికప్పుడు సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎస్ఐ వెంకటనరసింహం భారీ బందోస్తు నిర్వహించారు. వృద్ధులు, దివ్యాంగులు సైతం వీల్‌చైర్స్‌లో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎండను సైతం ఓటర్లు లెక్కచేయకుండా కేంద్రాల వద్ద క్యూలో నిలబడి ఓటు వేశారు. నీర్పాకోట ఎస్టీ కాలనీ, బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని పోలింగ్ బూత్‌లను తిరుపతి ఎంపీ గురుమూర్తి పరిశీలించారు.

సంక్షేమ ప్రభుత్వానికే ఓటర్ల మద్దతు

వరదయ్యపాళెం: పేద ప్రజల కోసం అభివృద్ధి, సంక్షేమ పాలనను అందించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైపు ఓటర్లు మొగ్గుచూపి జగనన్న రుణం తీర్చుకున్నారని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ వ్యాఖ్యానించారు. సత్యవేడులో ఫ్యాను ప్రభంజనం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన నియోజకవర్గంలోని నారాయణవనం , పిచ్చాటూరు మండలాల్లో విస్తృతంగా పర్యటించి పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 7 మండలాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సొంత మండలమైన నారాయణవనంలో పలుచోట్ల వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను ఉండనివ్వకుండా ఆయన, ఆయన తనయుడు పలు కుయుక్తులు పన్నినప్పటికీ మండలంలోని అన్ని బూత్‌లలో వైఎస్సార్‌సీపీ నాయకులు సమన్వయంతో ఏజెంట్లను ఏర్పాటు చేసి వారి కుట్రలకు దీటుగా సమాధానమిచ్చారన్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా ఓటర్లు బారులు తీరి మరీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం రాత్రి 8 గంటల వరకు 80.60శాతం పోలింగ్ జరిగినట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి తెలిపారు.



గోవర్ధనగిరిలో వృద్ధురాలిని పోలింగ్ కేంద్రానికి మోసుకొస్తున్న సహాయకుడు





బుచ్చినాయుడుకండ్రిగలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎంపీ గురుమూర్తి, వేణుగోపాలపురంలో ఈవీఎంలు మొరాయించడంతో కూర్చుని ఉన్న ఓటర్లు

నారాయణవనంలో..

నారాయణవనం: మండలంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఎండ తీవ్రత కారణంగా మందకొడిగా సాగినా పోలింగ్ మధ్యాహ్నం నుంచి పుంచుకుంది. మండలంలో కసిమిట్ట, నారాయణవనం బాలుర ఉన్నత పాఠశాలలో 134 పోలింగ్ కేంద్రం, తిరువట్యం, కొండల చెరువులలో ఈవీఎంలు మొరాయించాయి. కసిమిట్టలో 7 గంటలకు మాక్‌పోలింగ్ నిర్వహించి, 7.30 నుంచి పోలింగ్ ప్రక్రియ ప్రారంభించారు. భీమునిచెరువులో స్థానికులు అడ్డగించడంతో పోలీసుల సాయంతో ఏజెంట్లు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లారు. నారాయణవనంలో 135 కేంద్రంలో మధ్యాహ్నం 3 గంటలకే 88 శాతానికి పోలింగ్ చేరుకోగా కల్యాణపురం, కసిమిట్టలలో సాయంత్రం 7.30 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. వైఎస్సార్‌సీపీఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ ఎరికంబట్టు, నారాయనవనంలలోని పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సరళిని పరిశీలించారు. టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం కుటుంబసభ్యులతో కలిసి భీమునిచెరువులో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం పోలింగ్ ప్రారంభంలో మండలంలోని వెంగళత్తూరు, గోవర్ధనగిరి, ఎస్ఎస్‌బీ పేట పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు పనిచేయకపోవడంతో రిజర్వ్ ఈవీఎంలను అమర్చారు. దీనివల్ల గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ ప్రక్రియ మందకొడిగా సాగడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వందల సంఖ్యలో ప్రజలు క్యూలో నిలిచి అవస్థలు పడ్డారు. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ సమయం ముగిసినా వెంగళత్తూరు, గోవర్ధనగిరి, ఎస్ఎస్‌బీ పేటలతో పాటు చాలా పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు వందల సంఖ్యలో ఉండడంతో గేట్లు వేసి రాత్రి పది గంటల వరకు పోలింగ్‌ను కొనసాగించారు. స్థానిక ఎస్ఐ వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బుచ్చినాయుడుకండ్రిగలో దివ్యాంగురాలిని ఓటు వేయడానికి వీల్‌చైర్‌పై తీసుకొస్తున్న దృశ్యం





నారాయణవనం: ఉదయం 7 గంటలకే కసిమిట్ట పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు, కసిమిట్టలో ఓటు వేయడానికి వచ్చిన వృద్ధులు



తిరువట్యం పోలింగ్ కేంద్రంలో దివ్యాంగుడు



బుచ్చినాయుడుకండ్రిగలో బారులు తీరిన ఓటర్లు



వరదయ్యపాళెం పోలింగ్ బూత్ వద్ద ఓటర్లు



వెంగళత్తూరు పోలింగ్ కేంద్రం..